www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 5 ఏప్రిల్ 2025

5

అన్నమయ్య





కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు

జిల్లా సరే.. సౌకర్యాలేవీ..?

- కలెక్టర్ కార్యాలయంలో మౌలిక వసతులు కరువు
- ఏటిఎం సెంటర్, పోస్టల్ పాయింట్, కొరియర్ సర్వీస్, బస్సు షెల్టర్‌కు నోచని వైనం
- ఆందోళనలో అధికారులు, ప్రజలు
- జిల్లా కేంద్రం ఏర్పడి మూడేళ్లు పూర్తి



అన్నమయ్య జిల్లా కలెక్టరేట్

ప్రజాశక్తి - రాయచోటి

రాయచోటి అన్నమయ్య జిల్లా కేంద్రమైనా సౌకర్యాలు ఇప్పటికీ లేవు. ముఖ్యంగా కలెక్టరేట్ మౌలిక వసతులు కరువయ్యాయి. జిల్లా కేంద్రమై సుమారు మూడేళ్లవుతున్నా ఇప్పటి వరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం సౌకర్యాలుకు దూరంగా ఉంది. 2022 ఏప్రిల్ 4వ తేదీన అప్పటి వైసిపి ప్రభుత్వంలో జిల్లాల పునర్విభజనలో భాగంగా రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు, మదనపల్లి, తంబళ్లపల్లె, నియోజకవర్గలను కలిపి రాయచోటిని అన్నమయ్య జిల్లాగా ఏర్పాటు చేశారు. జిల్లా ఏర్పాటు చేసే సమయంలో మాసాపేటలోని గిరిజన బాలుర వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయంగా ఏర్పాటు చేశారు. ఇక్కడ దాదాపు 20కి పైగా జిల్లా కార్యాలయాలున్నాయి. దాదాపు 200 మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. జిల్లా ఏర్పాటు క్రమంలో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొక్కలు మాత్రమే ఉన్నాయి. తర్వాత అక్కడ ఎలాంటి వస్తువులు గాని, పనులు గాని చేపట్టలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు పది నెలలు అవుతున్నా ఇంత వరకు కలెక్టరేట్ కార్యాలయంలో అధికారులకు, ప్రజలకు కావాల్సిన సదుపాయాలు కల్పించలేదు. కలెక్టరేట్ భవనానికి కావాల్సిన స్థలాన్ని కేటాయించలేదు.

వసతులు కూడా అరకొర..

జిల్లాల పునర్విభజనలో భాగంగా 2022వ సంవత్సరంలో హడావుడిగా అరకొరగా పనులు మాత్రమే చేపట్టారు. వారికి అక్కడ అవసరమైన ఎటిఎం సెంటర్ ఏర్పాటు చేయలేదు. డబ్బులు కట్టాలన్నా, తీసుకోవాలన్నా రాయచోటికి నాలుగు కిలోమీటర్ల రావాల్సిన పరిస్థితి. పోస్టల్ యూనిట్ పాయింట్ కూడా కలెక్టర్ కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగులు కోరుకుంటున్నారు. ఏదైనా పార్సల్ చేయాల్సిన అవసరం ఉంటే కచ్చితంగా టౌన్‌కు వచ్చి చేయాల్సిందే. ఏదైనా చిన్న పనిపైన టౌన్‌లోకి రావాల్సి వస్తే ఆటోకు రాను, పోను రూ.వంద చెల్లించాలని ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది చెప్పుకొస్తున్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో కనీస వసతులు అందుబాటులో లేకపోవడంతో చాలామంది సిబ్బంది రకరకాల ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగులు, జిల్లాలోని ప్రజలు పని అయిపోయిన తర్వాత తిరిగి వారి ఇంటికి చేరుకునేందుకు రోడ్డుపైన బస్సు షెల్టర్ లేక బస్సు, ఆటోల కోసం గంటల తరబడి ఎండకు, గాలికి, వానకు నిలబడి అవస్థలు పడుతున్న పరిస్థితి నెలకొంది. అసలే అంతంత మాత్రమున్న అటెండర్లు ఆపై రెండు మూడు సెక్షన్లకు కలిసి ఒకరే పని చేస్తున్న పరిస్థితి. ఈ విషయాలపై సంబంధిత అధికారులు చొరవ చూపించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని వాదన కూడా బలంగా ఉంది. ప్రతి శనివారం జెసి కోర్టు, డిఆర్ఒ కోర్టుకు వచ్చేటువంటి ప్రజలు, న్యాయవాదులు వారి వాహనాలు మండుటెండలో ఎండి వానకు తడిసి ముద్దవుతున్న పరిస్థితి ఇక్కడ నెలకొని ఉంది.

నిరుపయోగంగా మరుగుదొడ్లు..

కలెక్టరేట్ కార్యాలయం వెనుక భాగంలోని బాలికల మైనార్టీ హాస్టల్ భవనంలో ఎస్‌సి కార్పొరేషన్, మైనార్టీ కార్పొరేషన్, జిల్లా చేనేత, టూరిజం, గిరిజన సంక్షేమ శాఖ జిల్లా ఔషధ, జిల్లా పరిశ్రమల శాఖ, జిల్లా ఆడిట్‌తో పాటు పలు జిల్లా కార్యాలయాలు ఏర్పాటు చేశారు. అక్కడ మరుగుదొడ్లు ఉన్నప్పటికీ పైపులైన్, నీటి సౌకర్యం లేక మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. అక్కడ దాదాపు ఉద్యోగులు, వందలాది మంది ప్రజలు వస్తూ ఉంటారు. ఆ కార్యాలయలలో మహిళ ఉద్యోగం కూడా అనేకమంది పనిచేస్తున్నారు. మరుగుదొడ్లు లేక అధికారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ విషయాల పైన చొరవ తీసుకొని వీలైనంత త్వరలో సౌకర్యాలు కల్పించాలని ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది కోరుకుంటున్నారు.



మైనార్టీ కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు



కలెక్టరేట్ ఎదుట బస్సు షెల్టర్ లేక ఎండలో కూర్చున్న ప్రజలు

శాశ్వత భవన సముదాయ నిర్మాణాలను చేపట్టాలి



కూటమి ప్రభుత్వం అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు జిల్లా కార్యాలయాల శాశ్వత భవనాల సముదాయం నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు వెంటనే చేపట్టాలి. కలెక్టర్ కార్యాలయంతో పాటు ప్రభుత్వ కార్యాల యాలన్నీ విద్యా సంస్థల భవనాల్లో కొనసాగుతున్నాయి. అన్ని విధాలా వెనుకబడిన రాయచోటిలో విద్యా అభివృద్ధి మరింత కుంటుపడుతుంది. జిల్లా కేంద్రమైన రాయచోటికి సమాన దూరంలో ఉన్న మదనపల్లె, రైల్వేకోడూరులను దృష్టిలో పెట్టుకొని రాయచోటి-రాజంపేట రోడ్డు మార్గం నుండి రాయచోటి-పీలేరు రోడ్డు మార్గంలో గాని, రాయచోటి-మదనపల్లె రోడ్డు మార్గంలోగాని కలెక్టర్ కార్యాలయం శాశ్వత భవనాల నిర్మాణాలు చేపట్టాలి.

- యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి, రాయచోటి.

వసతులు కల్పించాలి



కలెక్టరేట్ వెనుక భాగంలో ఉన్న కార్యాలయాలకు బాత్ రూమ్‌లకు పైప్‌లైన్ ఏర్పాటు చేసి నీటు వసతిని కల్పించాలి. కలెక్టరేట్ ఎదురుగా రోడ్డుపైన ఎండ, వర్షాలకు బస్సు షెల్టర్ లేక కలెక్టరేట్‌కు వచ్చే మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉన్నాయి. చలివేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయాలి.

- సురేంద్రరెడ్డి, వీరబల్లి.



పైప్‌లైన్ లేకపోవడంతో తుప్పుపట్టిన కొళాయిలు

రాజ్యాంగ హక్కులను కాపాడుకుందాం

- సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

లౌకిక విలువలను, మైనార్టీల హక్కులను హరిస్తున్న వక్ఫ్ సవరణలను నిరసించాలని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శుక్రవారం లౌకిక విలువలను, మైనార్టీల హక్కులను హరిస్తున్న వక్ఫ్ చట్ట సవరణను నిరసిద్దాం-రాజ్యాంగ హక్కులను కాపాడుకుందాం అంటూ సిపిఎం ముద్రించిన కరపత్రాలను విస్తృతంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం హిందుత్వ మతోన్మాద ఎజెండా అమలులో భాగంగా ముస్లిం ప్రజలపై విద్వేషాన్ని చిమ్ముతూ అనేక దాడులు చేస్తోందని పేర్కొన్నారు. లవ్ జిహాద్, ఘర్వాపసీ, కామన్ సివిల్ కోడ్, మసీదుల విధ్వంసం, మూక హత్యల తో హిందుత్వ శక్తులు తలపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వక్ఫ్ సవరణ చట్టం ద్వారా ముస్లింలు ధార్మిక, సామాజిక, సాంస్కృతిక సంస్థలపై దాడి తలపెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చట్టం ఆస్తుల కబ్జా చేయడానికి తప్ప, వక్ఫ్ ఆస్తులు అభివృద్ధికి కాదని స్పష్టం చేశారు. దుర్మార్గమైన సవరణలు చేస్తూ ముస్లిం ప్రజల ఆస్తులపై యుద్ధం ప్రకటించే ఈ బిల్లును లౌకిక పార్టీలుగా చెప్పుకునే టిడిపి, జనసేనతో సహా మరికొన్ని పార్టీలు తమ స్వార్థ ప్రయోజనాలకై బలపరచడంతో పార్లమెంటులో ఈ బిల్లు ఆమోదం పొందిందని వివరించారు. టిడిపి జనసేనల వైఖరి లౌకికత్వానికి విఘాతం కలిగించాయని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం సహా ప్రతిపక్షాలు ఈ బిల్లును పార్లమెంటులో గట్టిగా ఎదుర్కొన్నాయని తెలిపారు. ఒకసారి వక్ఫ్ చేయబడిన ఆస్తులు శాశ్వతంగా వక్ఫ్ ఆస్తులుగా ఉంటాయని వాటి స్వభావాన్ని మార్చే అధికారం ఎవరికి లేదనే సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా, భారత రాజ్యాంగంలోని 25, 29, 30 తదితర నిబంధనకు వ్యతిరేకంగా ఈ చట్టం చేయబడిందని తెలిపారు. లక్షల ఎకరాల వక్ఫ్ ఆస్తులు కొల్లగొట్టబడతాయని పేర్కొన్నారు. ఇతర మతాలవారు వక్ఫ్ బోర్డుల్లో సభ్యుల్లో చేర్చి వాటిని వివాదాస్పదం చేసే కుట్ర ఈ సవరణ బిల్లులో ఉందని పేర్కొన్నారు. భారత ప్రజలను మతపరంగా విభజించే కుట్రలో భాగంగా చేయబడిన వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకించాలని, ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెసి ఆదర్శ రాజేంద్రన్

8న డిడిఆర్‌సి సమావేశం : జెసి

ప్రజాశక్తి-రాయచోటి : అన్నమయ్య జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బి.సి.జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ (డిడిఆర్‌సి) సమావేశాన్ని నిర్వహిస్తున్నామని జెసి ఆదర్శ రాజేంద్రన్ అన్నారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో డిడిఆర్‌సి సమావేశంపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారులందరూ వారి శాఖలకు సంబంధించిన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై సిపిఒకి అందించిన సమగ్ర నివేదికలను క్లుప్తంగా సులభంగా అర్థం చేసుకునే విధంగా మార్పులు చేసి అందజేయాలని పేర్కొన్నారు. వివిధ శాఖల నుంచి వచ్చిన నోట్స్ సమీక్షించిన అనంతరం తయారు చేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను మంత్రికి వివరించేందుకు అనుకూలంగా తయారు చేయాలని సిపిఒను ఆదేశించారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



పవర్ స్ప్రేయర్‌ను ప్రారంభిస్తున్న చంద్రనాయక్

యాంత్రీకరణ పథకానికి రూ.2.50 కోట్లు మంజూరు

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రనాయక్

ప్రజాశక్తి-పీలేరు

అన్నమయ్య జిల్లాకు వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి రూ.2.50 కోట్ల నిధులు మంజూరయ్యాయని, వీటితో వ్యవసాయదారులకు వ్యక్తిగతంగా వ్యవసాయ పనిముట్లు కొనుగోలు చేసి పంపిణీ చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చందనాయక్ తెలిపారు. సబ్సిడీలో మంజూరైన పవర్ స్ప్రేర్లను శుక్రవారం ఆయన పీలేరులో రైతులకు పంపిణీ చేశారు. ఈ సందరరేగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో మంజూరైన నిధుల్లో ఇప్పటి వరకు 40 శాతం నిధులను వినియోగించామని, మిగిలిన నిధులను సద్వినియోగం చేసుకోడానికి రైతులు రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రబీ సీజన్లో జిల్లాలో వరి సాధారణ సాగు విస్తీర్ణం ఆరు వేల ఎకరాలకు గాను కేవలం 50 శాతం మాత్రమే సాగైందని, అలాగే వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం నాలుగు వేల ఎకరాలకు గాను 60 శాతం మాత్రమే సాగైందన్నారు. జిల్లాలో 400 రైతు సేవా కేంద్రాలు ఉండగా వాటిలో 30 కేంద్రాల్లో వివిధ కారణాలవల్ల ఉద్యోగుల ఖాళీలు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 1.78 లక్షల మంది రైతులు ఉన్నారని, వీరిలో 73 శాతం మంది రైతులు మాత్రమే ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ ప్రధానమంత్రి కిసాన్ యోజన పథకంలో పేర్లు నమోదు చేసుకున్నారని చెప్పారు. మిగిలిన రైతులు కూడా నమోదును పూర్తి చేసుకుంటే ప్రభుత్వ పథకాల్లో లబ్ధి పొందేందుకు అవకాశం ఉంటుందని తెలియజేశారు. సమావేశంలో పీలేరు వ్యవసాయ శాఖ ఎడిఎ వైవి రమణ రావు, మండల వ్యవసాయ అధికారిణి రమాదేవి, కలకడ వ్యవసాయ అధికారిణి లావణ్య, కె పల్లి వ్యవసాయ అధికారిణి యు.శ్రావణి, ఎఒ కరుణాకర్‌రెడ్డి, ఎఇఒలు ఇంద్ర, జ్యోష్న, నజీర్, అనిత పాల్గొన్నారు.

నేడు బాబు జగ్జీవన్ రామ్ జయంతి

ప్రజాశక్తి-రాయచోటి

డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 118వ జన్మదిన జయంతి వేడుకల సందర్భంగా శనివారం కలెక్టర్ వారి కార్యాలయంలోని (పిజిఆర్ఎస్) ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక సమావేశపు హాల్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ సంఘ నాయకులు, జిల్లా అధికారులు, అనధికారులు, ప్రజలందరూ హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

బిఎస్‌పి జిల్లా నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-రాయచోటి

బిఎస్‌పి జిల్లా నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షులు అబ్బవరం యుగంధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో బిఎస్‌పి పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే క్రమంలో భాగంగా అందుకు తగ్గ ప్రతిభ కలిగిన వ్యక్తులను జిల్లా కమిటీలోనికి, అసెంబ్లీ కమిటీలోనికి తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. జిల్లా ఇన్‌ఛార్జిగా ఎర్రగాళ్ళ వెంకటరమణ, ఖాజీ సాదిక్, జిల్లా జనరల్ సెక్రటరీగా పెద్దపాళ్యం సోమశేఖర్, జిల్లా సెక్రటరీ పెద్దవీటి నరసింహులు, రాజంపేట అసెంబ్లీ అధ్యక్షులుగా పెద్ది వీటి రామ్మోహన్, పీలేరు అసెంబ్లీ అధ్యక్షులుగా ద్రాక్షం మల్లీశ్వరి ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎంపికైన అభ్యర్థులు మాట్లాడుతూ పార్టీని అన్నమయ్య జిల్లాలో బలోపేతం చేయుచుటకు కృషి చేస్తామని తెలిపారు. అవకాశం కల్పించిన జిల్లా అధ్యక్షులు రాష్ట్ర అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆత్మహత్య చేసుకున్న రైతుకు న్యాయం చేయాలి

- జాతీయ రహదారిపై మాజీ సైనికుల ధర్నా
- కేసును నీరుగారుస్తున్న పోలీసులు
- తహశీల్దార్ పేరును ఎ1గా చేర్చాలని డిమాండ్



జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న మాజీ సైనికులు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మండలంలోని తాటిగుంటపల్లి గ్రామం పెద్దవంకపల్లికి చెందిన మాజీ సైనికుడు లక్ష్మయ్య రెడ్డి కుమారుడు వెంకటాద్రి అనే రైతు రెవెన్యూ అధికారులు, గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తుల వలన గురువారం ఉదయం చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ విషయంపై శుక్రవారం ఉదయం మదనపల్లి, వాల్మీకిపురంకు చెందిన మాజీ సైనికుల సంఘం నాయకులు కంచర్ల శ్రీనివాసులు నాయుడు, రవి, మధనమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో మదనపల్లి-తిరుపతి జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. రెవెన్యూ అధికారులు, గ్రామంలోని వ్యక్తుల వలన ఆత్మహత్య చేసుకున్న రైతు వెంకటాద్రికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న రైతు వెంకటాద్రి కేసును పోలీసులు నీరుగారుస్తున్నారని మండిపడ్డారు. ఎ1గా చేర్చాల్సిన తహశీల్దార్ పేరును ఎ4గా చేర్చడం ఏమిటని ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ చంద్రశేఖర్ సంఘటనా స్థలానికి చేరుకుని ధర్నా చేసేందుకు అనుమతి లేదని చెప్పడంతో ధర్నాను విరమించి, బాధిత కుటుంబ సభ్యులతో కలసి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రైతు ఆత్మహత్య కేసులో ఆరుగురిపై కేసు నమోదు

రైతు వెంకటాద్రి ఆత్మహత్య కేసులో ఇదే గ్రామానికి చెందిన వెంకట్రమణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మధన్‌రెడ్డి, తహశీల్దార్ పామిలేటి, నారాయణరెడ్డి, పీలేరు హోమ్‌లోన్ బ్యాంక్ మేనేజర్ మణికంఠ తదితరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

ఒంటిమిట్టకు బ్రహ్మోత్సవ శోభ

నేడు అంకురార్పణ, రేపు ధ్వజారోహణం - 11న సీతారాముల కల్యాణం

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

ఒంటిమిట్టకు బ్రహ్మోత్సవ శోభ వచ్చింది. నేటి నుంచి మొదలయ్యే కోదండ రామాలయం బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు, పనులు పూర్తయ్యాయి. ఆలయ ప్రాంగణం, ఆలయాన్ని దీపాలతో అలంకరించారు. శ్రీరామనవమిపై ప్రచారం కల్పించేందుకు భారీ ఫ్లెక్సీలు, గోడపత్రాలు అంటించారు. హరిత శోభకోసం ప్రత్యేకంగా మొక్కలను తెప్పించారు. కోదండ రామాలయం వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏప్రిల్ 11వ తేదీన జరుగనున్న సీతారాముల కల్యాణ ఘట్టానికి యుద్ధ ప్రాతిపదికన కల్యాణ వేదికను ముస్తాబు చేస్తున్నారు. కోదండరామస్వామి వార్షిక శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు శనివారం సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించనున్నారు. తొమ్మిది రోజులపాటు బ్రహోత్సవాల నిర్వహణకు టిటిడి యంత్రాంగం భారీగా ఏర్పాట్లు చేసిన సంగతి తెలిసిందే. ఉదయం 4 నుంచి 6 గంటల వరకు వ్యాసాభిషేకం (మూలవర్లకు అభిషేకం), 7.30 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 10 గంటలకు శ్రీరామనవమి ఆస్థానం, స్నపన తిరుమంజనం ఉంటుంది. రాత్రి 8 నుంచి 10 గంటల వరకు అంకురార్పణ నిర్వహిస్తారు. శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా జరుగనున్నాయి.



విద్యుత్ కాంతుల వెలుగులో కోదండరామాలయం

రేపు ధ్వజారోహణం

ఈ నెల 6న కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 9.30 నుంచి 11 .15 గంటలకు వృషభ లగ్నంలో ధ్వజారోహణం ఉంటుంది. ఆ తర్వాత పోతన జయంతి, కవి సమ్మేళనం కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు శేష వాహనంపై శ్రీ సీతారామలక్ష్మణులు భక్తులకు దర్శనమిస్తారు.

11న శ్రీ సీతారాముల కల్యాణం

ఏప్రిల్ 11వ తేదీన రాత్రి 6.30 నుంచి 8.30 గంటల వరకు సీతారాముల కల్యాణం వేడుకగా నిర్వహిస్తారు. అనంతరం గజ వాహనసేవ నిర్వహిస్తారు. 12న రథోత్సవం నిర్వహిస్తారు. 14న ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. 15న సాయంత్రం 5.30 నుండి రాత్రి 9 గంటల వరకు పుష్పయాగం వైభవంగా నిర్వహిస్తారు. ప్రతిరోజూ ఉదయం 7.30 నుండి 9.30 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు వాహనసేవలు జరుగనున్నాయి.

నేడు, రేపు కవి సమ్మేళనం

శ్రీ కోదండరామస్వామి ఆలయంలో శ్రీరామనవమి పర్వదినం, శ్రీపోతన జయంతిని పురస్కరించుకుని టిటిడి హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో సాయంత్రం 4 నుండి సాయంత్రం 7 గంటల వరకు కవి సమ్మేళనం నిర్వహించనున్నారు. పోతన భాగవతం, రామాయణంలోని కాండాలపై కవి సమ్మేళనం ఉంటుంది.



హనుమంత వాహనంపై విహరిస్తున్న రామయ్య

హనుమంతునిపై రామయ్య విహారం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వెయ్యేళ్లకు పైగా చరిత్ర కలిగిన వాల్మీకిక్షేత్రంలోని శ్రీ పట్టాభిరాముడి విశ్వావసు నామ సంవత్సర సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు శుక్రవారం సీతాసమేత పట్టాభిరాముడు తన ప్రియభక్తుడైన హనుమంతునిపై పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం సుప్రభాతసేవతో స్వామిని మేల్కొలిపి శుద్ధి, తోమాలసేవ, పంచాంగ శ్రవణం, కొలువు, అర్చన అనంతరం ఉదయం 8గంటలకు స్వామివారిని ముత్యపు పందిరి వాహనంపై పురవీధుల్లో విహరించారు. ఈ సందర్భంగా సలహాదారులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ చంద్రుడికి ప్రీతిగా ఈ వాహన సేవను నిర్వహించి, చంద్రగ్రహ దోష పీడితులు ఈ వాహన సేవలో పాల్గొంటే వారికి ప్రశాంతత కలుగుతుందని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ఉత్సవర్లకు స్నపన తిరుమంజన సేవ నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఊంజల మండపంలో ఊంజల్ సేవ నయనానందకరంగా నిర్వహించారు. కార్యక్రమంలో టిటిడి డిప్యూటీ ఇఒ వరలక్ష్మి, ఎఇఒ గోపినాథ్, సూపరింటెండెంట్ మునిబాలకుమార్, ఆలయ అధికారి క్రిష్ణమూర్తి, సిబ్బంది నాగరాజ, అర్చకులు కృష్ణరాజు భట్టర్, క్రిష్ణప్రసాద్ భట్టర్, భక్తులు పాల్గొన్నారు.

హనుమంతునిపై ఊరేగిన రాఘవుడు : బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి 8 గంటలకు ఉత్సవర్లకు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, సుగంధ పుష్పాలతో నయనానంధకరంగా అలంకరించి హనుమంత వాహనంపై స్వామివారు తిరుమాఢ విధుల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు. వాహన ఎదుట ఇరువైపులా మహిళలు నేతి దీపాలతో స్వాగతం పలికారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు : బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 8గంటలకు కల్పవృక్ష వాహనం, 10 గంటలకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 6గంటలకు ఊంజల్ సేవ, రాత్రి 8గంటలకు సింహ వాహనంపై స్వామివారు విహరిస్తారు.

మధురైకి బయలుదేరిన సిపిఎం శ్రేణులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : మధురై నగరంలో జరుగుతున్న సిపిఎం అఖిల భారత 24వ మహాసభల్లో పాల్గొనేందుకు అన్నమయ్య జిల్లా నుండి సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు శుక్రవారం మదురైకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ మతోన్మాద శక్తుల నుండి దేశాన్ని కాపాడుకోవడంతో పాటు కార్పొరేట్ అనుకూల సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన కర్తవ్యాలను అఖిల భారత మహాసభ దిశానిర్దేశం చేయనున్నదని తెలిపారు. సిపిఎం బలపడటం ద్వారా మాత్రమే కష్టజీవుల వెతలు తీరుతాయాన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పందికాళ్ళ మణి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సిపిఎం జాతీయ మహాసభలకు బయల్దేరిన సిపిఎం శ్రేణులు



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పవన్

సాధారణ కాన్పులు శ్రేయస్కరం

ప్రజాశక్తి-కలికిరి

సాధారణ కాన్పులే తల్లి, బిడ్డకు శ్రేయస్కరమని ప్రభుత్వ ఆస్పత్రి ప్రధాన వైద్యులు పవన్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు కాన్పులు పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ గర్భిణులకు సాధారణ కాన్పు త్వరగా కోలుకుంటారని అన్నారు. కాన్పు అయిన మరుసటి రోజే ఇంటికి వెళ్లిపోవచ్చని వివరించారు. సిజేరియన్ అయితే వారం రోజులపాటు ఆసుపత్రి లో ఉండాలని కోలుకునేందుకు ఎక్కువ సమయం పడుతుందన్నారు. ప్రతి నెల క్రమం తప్పకుండా గైనకాలజిస్ట్ దగ్గర పరీక్షలు చేసుకొని సూచనలను పాటించాలని చెప్పారు. నార్మల్ డెలివరీ అయితే పిల్లల్లో రోగ నిరోధక శక్తి కూడా ఎక్కువ ఉంటుందని తెలిపారు.గత నెలలో కలికిరి ఆస్పత్రిలో మొత్తం నార్మల్ డెలివ రీలు జరిగాయని తెలిపారు. కార్యక్రమంలో గర్భిణులు, వైద్యుసిబ్బంది పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** స్థానిక ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులకు సాధారణ కాన్పులపై డాక్టర్ అమరసింహరాజు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీలకు నార్మల్ డెలివరీ జరిగితే రికవరీ తొందరగా ఉంటుందన్నారు. సిజేరియన్ అయితే పది రోజుల పాటు ఆసుపత్రిలో ఉండవలసి ఉంటుందని కోలుకునేందుకు ఎక్కువ సమయం పడుతుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శక్తి యాప్ మహిళలకు రక్ష

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మహిళా శక్తి యాప్ పై ప్రతి మహిళ అవగాహన పెంచుకోవాలని మదనపల్లె శక్తి టీమ్ ఇన్‌చార్జ్ ఎస్ఐ గాయత్రి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంఎల్ఎల్ ఆస్పత్రి సమీపంలోని మహిళా ఇంటిగ్రేటెడ్ హాస్టల్ వద్ద శక్తి యాప్ పై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మహిళలు అందరూ శక్తి యాప్ తమ ఫోన్లలో ఇన్ స్టాల్ చేసుకొని, ఆపదలో ఉన్న సమయంలో ఆ యాప్ ను ఉపయోగించి, సరైన సమయంలో పోలీసులకు సమాచారం అందుతుందని, తద్వారా మహిళలు రక్షణ పొందాలని సూచించారు. శక్తి యాప్ పని చేసే విధానాన్ని మహిళలకు ఎస్ఐ గాయత్రి వివరించారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న ముక్కా వరలక్ష్మీ

ఘనంగా సీతారాముల కల్యాణం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని వత్తలూరు గ్రామ ప్రజల ఆహ్వానం మేరకు శ్రీ సీతారాముల విగ్రహ ప్రతిష్టాపన, కల్యాణ మహోత్సవానికి కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరలక్ష్మికి గ్రామస్తులు, ఆలయ నిర్వాహకులు సాంప్ర దాయ బద్ధంగా స్వాగతం పలికారు.అత్యంత కన్నుల పండువగా సాగిన శ్రీ సీతా రాముల విగ్రహ ప్రతిష్టాపన, కల్యాణోత్సవంలో ఆమె పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మరో రెండు రోజుల్లో రాబోవు శ్రీరామనవమి పండుగను గ్రామస్తులందరూ కలిసి అంగరంగ వైభవంగా నిర్వహించుకోవాలని కోరారు.నియోజవర్గ ప్రజలందరూ సుభిక్షంగా ఆకాంక్షించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంటర్ క్లాసులు ప్రారంభం

ప్రజాశక్తి - నందలూరు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 1వ తేదీ నుంచే సెకండ్ ఇయర్ విద్యా సంవత్సరం ప్రారంభమైందని ప్రిన్సిపల్ శ్రీదేవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులకు మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ సంబంధించిన అడ్మిషన్స్ ఏప్రిల్ 7 నుంచి ప్రారంభ మవుతాయని అన్నారు. ప్రస్తుతం బ్రిడ్జ్ క్లాస్ నిర్వహించడం జరుగు తుందని అన్నారు. ఈ కళాశాలలో బైపిసి, ఎంపిసి, సిఇసి గ్రూపులు ఉన్నాయని అన్నారు.ఈ సంవత్సరం నుంచి ఈ కళాశాలలో సైన్స్ విద్యార్థులకు ఎంబైపిసి క్లాసుల తో పాటు, నీట్, ఎంసెట్ పైన కూడా శిక్షణ ఉంటుందని అన్నారు. కళాశాల టైమింగ్స్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గం టల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, గుణాత్మక విద్య అందిం చడంతో పాటు నాన్ కో కరికులర్, సాంస్కృతిక, సహ పాఠ్య అంశాలతో విద్యార్థుల సంపూర్ణ మూర్తిమత్వం కొరకు మా కళాశాల పనిచేస్తుందని, స్థానికులు ఇక్కడే తమ పిల్లల చేర్పించి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ధర్నాలు, రాస్తారోకోలు నిషేధం

ప్రజాశక్తి-పుల్లంపేట : మండలంలో 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున ధర్నాలు, రాస్తారోకోలు నిరసనలు నిషేధమని పుల్లంపేట ఎస్ఐ మోహన్‌కుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో పుల్లంపేటలో ముస్లిము పెద్దలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డుకు సంబంధించిన బిల్లు పార్లమెంటులో ఉన్నందున దానికి సంబంధించి ముస్లిం సోదరులు ఎటువంటి అల్లర్లకు పాల్పడకుండా శాంతియుతంగా ఉండాలని సూచించారు. ఎటువంటి కార్యక్రమం అయినా పోలీసులు అనుమతి లేకుండా చేయకూడదన్నారు.

జెఎన్‌టియు విశ్వవిద్యాలయానికి కృషి చేస్తా : ఎమ్మెల్యే



క్రీడల్లో విజేతగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కలికిరి

మండల కేంద్రం కలికిరిలో జెఎన్‌టియు విశ్వవిద్యాలయానికి కృషి చేస్తానని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన స్పోర్ట్స్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ తండ్రి నల్లారి అమర్నాథరెడ్డి మంత్రి హోదాలో మరణించే నాటికి తనకు 21 సంవత్సరాలని, అప్పట్లో తానే పోటీలో ఉండాల్సి రాగా వయస్సు లేదని తన కిరణ్‌కుమార్‌రెడ్డిని బలవంతంగా మా అమ్మ, నేను కలిసి రాజకీయాల్లోకి తీసుకొచ్చామని ఆయన గుర్తు చేశారు. 50 ఏళ్లకే ముఖ్యమంత్రి అయ్యి రాష్ట్రానికి సేవ చేశారని గుర్తు చేశారు. కిరణ్ కుమార్ రెడ్డి హయంలో కలికిరిలో జెఎన్‌టియును స్థాపించగా ఆయన దిగిపోయేనాటికి నిర్మాణాలన్నీ అసంపూర్తిగా మిగిలిపోయాయని అన్నారు. తర్వాత చంద్రబాబు సిఎం అయ్యారని, తమకు ఆయనకు సంబంధం లేకపోయినా కూడా సహకారం అందించి జెఎన్‌టియు కళాశాలను పూర్తి చేసి ప్రారంభించామని తెలిపారు. భవిష్యత్తులో మదనపల్లె జిల్లా కాబోతుందని, ఈ క్రమంలో కలికిరి జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాలను యూనివర్సిటీగా మార్చాల్సిందిగా అసెంబ్లీలో గట్టిగా వినిపించానని ఆయన అన్నారు. ఇదే విషయాన్ని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి పరిస్థితులు వివరించామని తెలిపారు. ఇదే జరిగితే జిల్లాలో జెఎన్‌టియు యూనివర్సిటీ ఉన్న కలికిరికి ప్రత్యేక గుర్తింపు వస్తుందని అన్నారు. తమ కుటుంబం ఎప్పటికీ ప్రజాసేవకే అంకితమవుతామని తెలిపారు. అనంతరం ఆటల పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు బహుమ తులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జెఎన్‌టియు ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు సదరం కష్టాలు

- ఉదయం నుంచి సచివాలయం వద్దే పడిగాపులు

ప్రజాశక్తి-పుల్లంపేట

గ్రామ వార్డు సచివాలయాల దగ్గర సర్వర్ మొరాయించడంతో సదరం సర్టిఫికెట్ కోసం విభిన్న ప్రతిభావంతులు అవస్థలు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటగా ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి సదరం స్లాట్ బుకింగ్ ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. వెంటనే పింఛన్ పంపిణీ కార్యక్రమం ఉన్నందువల్ల సచివాలయ ఉద్యోగస్తులు అందరూ పింఛన్ పంపిణీ కార్యక్రమానికి వెళుతుండడం వల్ల సదరం స్లాట్ బుకింగ్ 4వ తేదీ నుంచి నుంచి ప్రారంభించడం జరుగుతుందని అధికారులు తెలిపారు. సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి నాలుగో తేదీ నుంచి సదరం స్లాట్ బుకింగ్ ఓపెన్ అవడం జరుగుతుందని విభిన్న ప్రతిభావంతులు సచివాలయం దగ్గరికి వచ్చి స్లాట్ బుక్ చేసుకోవడానికి అవకాశం ఉందని తెలియజేశారు. దీంతో విభిన్న ప్రతిభావంతులు ఉదయం 9 గంటల నుంచి సచివాలయాల దగ్గర పడిగాపులు కాస్తున్నారు. 10గంటలకు సచివాలయం ప్రారంభమైనప్పటి నుంచి సాయంత్రం వరకు కనీసం ఒక్క సదరం స్లాట్ బుక్ కాకపోవడం గమనార్హం. ఉదయం వచ్చిన తిండి తిప్పలు లేకుండా సచివాలయాల దగ్గరే పడిగాపులు విభిన్న ప్రతిభావంతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సదరం స్లాట్లు బుక్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



సదరం సర్టిఫికెట్ కోసం వేచి ఉన్న విభిన్న ప్రతిభావంతులు

'ఉపాధి' పనులను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎపిఒ



కూలీలకు సూచనలు ఇస్తున్న ఎపిఒ

ప్రజాశక్తి-రామపురం

మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎపిఒ పెంచలయ్య తనిఖీ చేసి కూలీలు చేస్తున్న పని పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలోని చిట్లూరు గ్రామంలోని చెరువుముందరపల్లి, పెద్ద చెరువులో చేపట్టిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను శుక్రవారం ఎపిఒ తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో చేపట్టిన ఉపాధిహామీ పనులతో వలసలు లేవని అన్నారు. పనుల్లో నాణ్యత ఉండడం సంతృప్తిగా ఉందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో పశువుల దాహార్తించడానికి నీటితొట్లు, పశుగ్రాస కోసం గడ్డి పెంపకానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. అవసరం ఉన్న పాడి పశువుల రైతులు నీటితొట్ల నిర్మాణానికి పశుగ్రాస పెంపకానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కూలీలు వలసలు వెళ్లకుండా ఇంటి వద్దనే ప నులు చేసుకోవడానికి ఉపాధి హామీ పనులను ఉపయోగించుకోవాలని అన్నారు. ఎపిఒ వెంట టిఎ.శివానందరెడ్డి, ఎఫ్ఎ మల్లికార్జున ఉన్నారు.



విధులు బహిష్కరించిన నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

అమరావతి హైకోర్టు న్యాయవాది కోటిపల్లి అయ్యప్పపై దాడి చేయడం అమానుషమని బార్ అసోసియేషన్ అధ్యక్షులు జనార్ధన్‌రెడ్డి కార్యదర్శి గఫర్ అన్నారు. స్థానిక జూనియర్ సివిల్ జడ్జికోర్టులో శుక్రవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. సోమవారం కూడా విధులు బహిష్కరిస్తున్నట్లు వారు తెలిపారు. న్యాయవాదులపై ఇలాంటి దాడులు జరగడం అయోమయ చర్యగా భావిస్తూ తగిన చర్యలు చేపట్టాలని కోరారు. నిరస న కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

వైసిపి మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వైసిపి మండల కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. ఆ పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో మదనపల్లె మండల కమిటీని నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్ ఎన్నుకున్నట్లు తెలిపారు. కొత్తపల్లెకు చెందిన ఎం.మహేష్ బాబునాయుడు గత ఎన్నికల్లో వైసిపి కోసం కష్టపడడంతో గుర్తింపుగా పార్టీలో సముచిత స్థానం కల్పించి, వైసిపి మండల కమిటీ జనరల్ సెక్రటరీగా నియమించినట్లు తెలిపారు. **నిమ్మనపల్లి:** నిమ్మనపల్లి మండల పార్టీ కమిటీను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులను జారీ చేసింది. ఇదివరకే మండల అధ్యక్షులుగా కొమ్మేపల్లి శ్రీనివాసుల రెడ్డిని నియమించగా, వారు బాధ్యతలు స్వీకరించారు. గురువారం వెలువడిన ఉత్తర్వులలో ఉపాధ్యక్షులుగా ఎ.నాగరాజ, పి.రాజగోపాల్, ప్రధాన కార్యదర్శులుగా పి.శ్రీనివాసులు, జి.చరణ్, కే.రమణ, డి.ప్రసాద్ బాబు, కార్యదర్శులుగా ఇ.నాగార్జున, ఎస్.ఖాదర్ భాష, ఆర్.రెడ్డి ప్రసాద్, ఏ.నారాయణ, కె.రెడ్డి శివకృష్ణ, సభ్యులుగా యు.రెడ్డి ప్రసాద్, ఎం.నరసింహులు, డి.కదిరప్ప వై.ఎర్రం నాయుడు, వై.నాగరాజ, ఇ.నాగరాజ, జి.గుర్రప్ప, కే.నరేష్, పి.వెంకటాద్రి, సి.వెంకటరమణలను నియమిం చింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా ఎన్నుకోబడిన కమిటీ పార్టీ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటూ, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తుందని అన్నారు. తమ నియామకానికి సహకరించిన రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డికి, మదనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్ అహ్మద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆన్‌లైన్‌లో మెగా డిఎస్‌సికి ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-రాయచోటి : మెగా డిఎస్‌సికి సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ ఇవ్వబడుతుందని, ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని వారు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ అధికారి సురేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మెగా డిఎస్‌సికి సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. ఉచిత శిక్షణ పొందేందుకు బిసి, ఇబిసి కేటగిరీ లకు చెందిన అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. టెట్ అర్హత సాధించిన అభ్యర్థులు సొంత జిల్లాలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అర్హులైన వారు రాయచోటిలోని బిసి సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖా స్తులు పొంది అక్కడే సమర్పించాలన్నారు.

పశుగ్రాసానికి రుణాలు : ఎపిఒ

ప్రజాశక్తి-చిట్వేలి

ఉపాధి హామీ పథకం ద్వారా పశువులు ఉన్న రైతులకు 50 సెంట్లు భూమికి రూ.32 వేలు పశుగ్రాసాన్ని పెంచుకునేందుకు రుణాలు ఇవ్వడం జరుగు తుందని ఎపిఒ నాగరాజు తెలిపారు. రెండు రోజుల క్రితం వీరబల్లి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుటుంబంలో ఎవరైనా కొత్తగా జాబ్ కార్డులో దరఖాస్తు చేసుకున్న వెంటనే వారికి పని కల్పించడం జరుగుతుం దని తెలిపారు. మండలానికి గ్రామాలలో 50 పశువులకు నీరు తాగేందుకు తొట్లు మంజూరయ్యాయని, అందులో 20 ప్రారంభ దశలో ఉన్నాయని, మిగతా 30 కూడా త్వరలో ప్రారంభిస్తామన్నారు. హార్టికల్చర్ మామిడి, జామ, నిమ్మ, నేరేడు, ఫ్లోరికల్చర్ రోజా, మల్లి తోటలకు పెంచుకునేందుకు ఆసక్తి కలిగిన రైతులు ఉపాధి హామీ కార్యాలయాన్ని సంప్రదించాలని అన్నారు. ఐదు ఎకరాల లోపు ఉన్న రైతులకు మాత్రమే ఈ అవకాశం ఉంటుందని అన్నారు. తహశీల్దార్ దగ్గర చిన్న సన్న కారు రైతు ధ్రువపత్రాన్ని కూడా తీసుకురావాలన్నారు. ముఖ్యంగా వేసవి తాపం ఎక్కువగా ఉండటంతో ఉపాధి కూలీలు వారికి కేటాయించిన సమయాన్ని ఉదయం పూటనే త్వరగా వెళ్లి ముగించుకోవడం లేదా ఉదయము సాయంకాలం కలిపి సమయాన్ని రెండు భాగాలుగా చేసి పని చేసుకోవచ్చన్నారు. పనికి వెళ్లే కూలీలు వాటర్ బాటిళ్లు తీసుకెళ్ళాలని సూచించారు. ఎండ తీవ్రత ఎక్కువుగా ఉంటే దగ్గర్లో ఏవైనా చెట్టు దగ్గర తగినంత సేద తీరాలని తెలిపారు.

అంబేద్కర్ విగ్రహాన్ని కూల్చిన

అధికారులపై కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని కూల్చేసిన అధికారులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు నమోదు చెయ్యాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు యమలా సుదర్శన్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఎర్రయ్య అంబేద్కర్‌పై అభిమానంతో రెండేళ్లక్రితం తన స్వగ్రామం సదుం మండలం కలకటవారిపల్లెలో తనసొంత ఖర్చు రూ.4లక్షలు వెచ్చించి అంబేద్కర్ విగ్రహాన్ని నెలకొల్పాడన్నారు. జీర్ణించుకోలేని అగ్ర వర్ణాల వారు తమ అధికార పలుకుబడిన ఉపయోగించి అంబేద్కర్ విగ్రహాన్ని కూలదోయడం దుర్మార్గమన్నారు. రక్షించాల్సిన అధికారులైన ఎస్ఐ, సిఐ, తహశీల్దార్ దగ్గరుండి అంబేద్కర్ విగ్రహాన్నే కూల్చేయడమేంటని ప్రశ్నించారు. అధికారులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయడంతో పాటు వెంటనే యధా స్థానంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దళిత సంఘాలతో ఉద్యమ బాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

70 శాతం సర్వే పూర్తి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-చిట్వేలి : జిఎస్ డబ్ల్యూ డైరెక్టర్ ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది గ్రామాల్లో పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించడం జరుగుతుందని ఎంపిడిఒ మోహన్ తెలిపారు. మండలంలోని తిమ్మయ్యగారిపల్లెలో ఆకస్మిక తనిఖీ చేసి పూర్తిస్థాయిలో సర్వే వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్క్ ఫ్రమ్ హోమ్, నాన్ రెసిడెన్సి, ఎపిడెత్ మార్క్ ఆడిట్, ఆరు సంవత్సరాల లోపు పిల్లల ఆధార్ వెరిఫికేషన్, చైల్డ్ వితౌట్ ఆధార్ కార్డ్ ,హౌస్ ఓల్డ్ జియో టాక్, మిస్సింగ్ సిటిజెన్ మ్యాపింగ్, పెండింగ్ సిటిజెన్, ఇకెవైసి తదితర అన్ని రకాల సర్వేలతో పూర్తిస్థాయిలో చేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ సుధాకర్,విఆర్ఒ, సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి-రాయచోటి : లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో కృష్ణ ఆస్పత్రి ఎండి డాక్టర్ హెచ్.ఉషారాణి ఆర్థిక సాయంతో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రి కోసం 30 దుప్పట్లను ఆసుపత్రి సూపరింటెంట్ డా.డేవిడ్ సుకుమార్‌కి అందించినట్లు అధ్యక్షులు లయన్ పి.శివారెడ్డి తెలిపారు. డాక్టర్ ఉషా రాణి మాట్లాడుతూ తన వంతుగా ప్రజలకు ఉపయోగపడే సేవ చేయాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సపొందే రోగులకు దుప్పట్లను పంపిణీ చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిఎంటి కో-ఆర్డినేటర్ లయన్ పి.ఎస్.హరినాథ్ రెడ్డి, జోన్ చైర్మన్ లయన్ షేక్ మహమ్మద్, డిస్ట్రిక్ట్ చైర్మన్ లయన్ వి.హరీష్‌చంద్ర, కార్యదర్శి లయన్ షేక్ ఇందాద్ అహమ్మద్, లయన్ డాక్ర్ మహేశ్వర్‌రాజు,హెడ్ నర్స్ పద్మావతి,ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



నేలవాలిన అరటి పంటను పరిశీలిస్తున్న రవిచంద్రబాబు

52 ఎకరాల్లో అరటి పంట నష్టం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

గురువారం కురిసిన అకాల వర్షాలు, బలమైన ఈదురు గాలులకు మండలంలో 31 మంది రైతులకు చెందిన 52 ఎకరా అరటిపంట నష్టం జరిగిందని ఉద్యాన శాఖ అధికారులు తెలిపారు. మండలంలోని అనంతరాజుపేట, బొజ్జవారిపల్లె, రాఘవరాజపురం, ఉర్లగొట్టుపోడు, బయనపల్లి, కెసి అగ్రహారం,ఉప్పరపల్లి గ్రామాలలో పలు ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. జిల్లా ఉద్యాన అధికారి పి.రవిచంద్రబాబు మండలంలో పలు గ్రామాల్లో దెబ్బతిన్న ఉద్యాన పంటలను సందర్శించి పంట నష్ట వివరాల గురించి విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి తుది జాబితాను త్వరితగతిన సిద్ధం చేయాలని మండల ఉద్యాన అధికారి, విలేజ్ హార్టికల్చర్, అగ్రికల్చర్ అసిస్టెంట్లను ఆదేశించారు. ప్రాథమిక అంచనా ప్రకారం ప్రధానంగా మండలంలో 52 ఎకరాలలో అరటి పంట నేల రాలింది. తద్వారా 31 మంది ఉద్యాన రైతులకు నష్టం వాటిల్లింది. బంతిపూల తోట రెండు ఎకరాలు, తమల పాకు తోట 1.30ఎకరాలు దెబ్బతినడం వల్ల ముగ్గురు రైతులు నష్టపోయారు. కార్యక్రమంలో చిట్వేలి, రైల్వేకోడూరు మండల ఉద్యాన అధికారులు ఎన్. ఆషియా, ఎం.భాస్కర్, విలేజ్ హార్టికల్చర్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

క్రైం కార్నర్



నిందితుడి అరెస్టును చూపుతున్న పోలీసులు

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

హత్యాయత్నం కేసులో నిందితుడిని శుక్రవారం రెండో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ రహీం తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం రామ్ నగర్‌కు చెందిన సురేంద్రబాబు, బర్మావీధికి చెందిన వేణుగోపాల్ రెడ్డి తన భార్యతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడన్న అనుమానంతో కక్ష పెంచుకున్నాడని తెలిపారు. సురేంద్రబాబు ను అంతమొందించాలన్న కోపంతో ఈ నెల 1వ తేదీ సాయంత్రం రామ్‌నగర్ పార్కలోవాకింగ్ చేస్తున్న సురేంద్రబాబు పై వేణుగోపాల్ రెడ్డి కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారని తెలిపారు. పక్కనే ఉన్న శ్రీనివాసులు అడ్డుకోబోగా అతనిపై కూడా కత్తితో దాడి చేయడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారని అన్నారు. డిఎస్‌పి కొండయ్య నాయుడు అదేశాలతో సిఐ రామచంద్ర సూచనల మేరకు ఎస్ఐ రహీం, ఎఎస్ఐ రమణ హత్యాయత్నంకు పాల్పడ్డ వేణుగోపాల్‌రెడ్డి పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు అనంతరం నిందితుడిని శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

బైక్‌పై స్టంట్ చేస్తే కఠిన చర్యలు

- ఇద్దరు యువకులపై కేసు నమోదు : సిఐ

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

ద్విచక్ర వాహనాలపై స్టంట్ చేస్తూ అధిక వేగంతో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని రాయచోటి అర్బన్ సిఐ చలపతి అనాన్నరు. గురువారం మదనపల్లి రోడ్డులో స్కూటీపై అతి వేగంగా నిర్లక్ష్యంతో స్టంట్ చేస్తున్న ఇద్దరు యువకుల వీడియో వైరల్ అవ్వడంతో స్పందించిన రాయచోటి పోలీసులు శుక్రవారం ఇద్దరు యువకులపై కేసు నమోదు చేయడమే కాకుండా డ్రైవింగ్ లైసెన్స్‌లేని యువకులకు స్కూటీ ఇచ్చిన యజమాని పై కూడా కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ తమ పిల్లలకు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఎలాంటి బైక్ లు ఇవ్వకూడదని తెలిపారు. అతివేగంగా వాహనాలు నడిపితే ప్రమాదాలు జరుగుతాయని దీని ద్వారా ప్రజలకు ఇబ్బంది కలిగించడమే కాకుండా తల్లిదండ్రులకు బాధను మిగుల్చుతాయని అన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లల పట్ల జాగ్రత్త వహించాలని కోరారు. పట్టణంలో ఎవరైనా అతివేగంగా వాహనాలు నడిపిన, స్టంట్‌లు చేసినా కఠిన చర్యలు తప ్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ జహీర్, శ్రీనివాసులునాయక్ పాల్గొన్నారు.

మహిళ మిస్సింగ్‌పై కేసు నమోదు

ప్రజాశక్తి-కలకడ



గీత (ఫైల్ ఫొటో)

మహిళ మిస్సింగ్‌పై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ హరిబాబు తెలిపారు.స్థానిక పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. మండలంలోని దేవలపల్లి పంచాయతీలోని ఎగువ దళితవాడలో నివాసమున్న చిన్నయ్య, గీత భార్యభర్తలు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రస్తుతం గీత వారి గ్రామానికి టిడిపి తరుపున ఎంపిటిసిగా కొనసాగుతున్నారు. తను ఇంట్లో పని సరిగా చేయలేదని అప్పుడప్పుడు చిన్నయ్య భార్య ను మందలిస్తూ ఉండే వాడని అన్నారు. చిన్నయ్య కూలి పనులకు పోయి మధ్యాహ్నం ఇంటికి రాగా తన భార్య కనపడలేదని, ఇంటిలో వున్న తన కుమార్తె ను అడుగగా తెలియదు అని చెప్పడంతో బంధువులు, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ తెలియరాలేదని అన్నారు. బంగారువాండ్లపల్లి గ్రామానికి చెందిన జాఫర్ అనే వ్యక్తితో వెళ్లి పోయి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారని అన్నారు. గీత భర్త చిన్నయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థి అదృశ్యంపై..

మదనపల్లె అర్బన్ : పదవ తరగతి తరగతి పరీక్ష రాయడానికి మదనపల్లెకి వచ్చిన విద్యార్థిని అదృశ్యమైన సంఘటనపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ రహీం కథనం మేరకు.. మదనపల్లె మండలం, కోళ్లపై గ్రామానికి చెందిన బాలిక 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు రాసేందుకు రోజూ మదనపల్లెకు వచ్చి వెళ్ళేది. చివరిరోజు సాంఘిక శాస్త్రం పరీక్షరాసేందుకు జడ్పీ హైస్కూల్ కు వచ్చిన విద్యార్థి పరీక్ష అనంతరం అదృశ్యమైంది. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించిన ఆచూకీ లభించలేదు. విద్యార్థి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం అర్ధరాత్రి మదనపల్లె మండలం లో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. సుమారు 55 సంవత్సరాల వయసున్న గుర్తుతెలియని వ్యక్తి బసినికొండ సాయిబాబా గుడి వద్ద రోడ్డు పక్కన నడిచి వెళుతుండగా, గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన ఆ వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించి దర్యాప్తు చేపట్టారు. మృతుడి వివరాల కోసం, అదే విధంగా ప్రమాదానికి కారణమైన వాహనం అచూకీ కోసం విచారణ చేపట్టారు.